# ముందుమాట

అసంగము అను అస్త్రము బంధములను తొలగించును. అసంగ మనగా సంగము లేకుండుట. సృష్టి జీవునకు సృష్టితో సంగము తప్పదు. అసంగమును పేరిట అన్నిటిని నిరాకరించినచో పరిష్కారము లభించదు. అందువలన తెలిసినవారు అసంగమును విశేషముగ నిర్వచించిరి. "అ"తో సంగమే "అసంగము". అక్షరములలో 'అ', "నేను" అని భగవంతుడు పలికినాడు. అనగా సర్వ విషయములయందు, సర్వ అవస్థలయందు, సర్వకాలము నందు దైవముతో సంగమించుట అసంగ మగును. దైవము పేరున కుటుంబములను విసర్జించుట, ఇంద్రియములను, దేహమును శుష్కింపచేయుట చేయు జీవుడు దుఃఖమును పొందుచున్నాడు.

"సన్యాసము వచ్చునది కాని పుచ్చుకొనునది కాదు." అని గురువరేణ్యులు శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు ఎలుగెత్తి చాటినారు. భాగవతమూర్తు లందరును సర్వము నందలి దైవముతో సంగమించిరి కాని ప్రత్యేకముగ సన్యాసము పుచ్చుకొనలేదు.

అసంగుని కథ అట్టిది. అసంగము అను అస్త్రమును గూర్చి భగవంతుడు గీత యందలి పదిహేనవ అధ్యాయమున శ్లాఘించినాడు. దాని నిర్వహణమే అసంగుడు కావించినాడు. ఈ పుస్తకమున అసంగునికి బుద్ధుడు ఈ రహస్యము తెలిపినట్లుగ వివరింపబడినది. సాధక జనులు శ్రద్ధతో ఇందలి విషయములను పఠించి మేల్కాంచుదురు గాక !

– కె. పార్వతీకుమార్

# 1

సుఫ్రరద్రూపి, యవ్వనవంతుడు, రాజవంశీయుడు యగు యొక సన్యాసి గౌతమబుద్ధుని గూర్చి విని అతని దివ్య భాషణము లను వినుటకై బుద్ధుడు వసించుచున్న యొక విహారమున కేతెంచెను. ప్రసంగము అప్పుడే మొదలైనది. బుద్ధుడిట్లు పలుకు చున్నాడు.

“మంచి చెడుల జన్మస్థాన మొకటే. చీకటి వెలుగుల జన్మస్థానము కూడ ఒకటే. జ్ఞానమున్నచోటే అజ్ఞానము కూడ యుండును. దీపమున్నచోట నీడ కూడ యుండును. సృష్టియందు ద్వంద్వములు సహజము. ద్వంద్వముల యందు ఒక దానిని కోరి రెండవ దానిని విసర్జించువాడు నిరంతరము పోరాట మందుండును.”

“ద్వంద్వములందేది కోరినను ఘర్షణ తప్పదు. సంసారమును అలక్ష్యము చేసి సన్యాసమును పుచ్చుకొన్నచో దుఃఖమే కలుగును. దేనిని కోరక దైవము నందుండుట సన్యాసమగును కాని ఒకదానిపై ద్వేషముచే రెండవది ఆదరించువాడు లేక ఒకదానిపై ఆదరముచే రెండవదానిని గర్హించువాడు నిజమైన సన్యాసికాదు. కోరుట వలన సన్యాసము లభించదు. ద్వంద్వములు తనయందు శమించి

కోరికలు లేని స్థితిలో జీవితమును పరిపూర్ణముగ అంగీకరించి, అందు తన ధర్మమును నిర్వర్తించువాడే నిజమగు సన్యాసి. అతడు సంసారమును కోరడు. అట్లని సన్యాసమునూ కోరడు. సమస్తము నందలి దైవముతో ముడిపడినవాడే తెలిసినవాడు. జీవితమున తా నెన్నుకొన్నది దుఃఖమునే అందించును. తనకు లభించినది సంతోషము కలిగించును. రెండవ మార్గమున సంతోషమునకు కారణము, అది తాను కోరక దైవముచే అందించ బడినది కావున. మొదటిది తాను కోరుకున్నది కావున.''

''తాను కోరిన విషయమెప్పుడు, తనకు వ్యామోహమై దుఃఖమును కలిగించును. జీవితమున అందివచ్చిన దానియందు దైవమును చూచుచు అనుభూతి చెందుటయే రసోపేతమగు యోగానుభూతి. కొన్నిటి నాదరించి, కొన్నిటిని గర్హించుట అవిశ్రాంత పోరాటమే అగును.''

''సన్యాసి మనస్ఫూర్తిగ నవ్వలేడు. అతని హృదయము ఆనందముతో నృత్యము చేయునట్లు స్పందింపలేదు. అతనికి స్త్రీ యన్నచో భయము. ధనమన్నచో భీతి. సామాన్యముగ సన్యాసులట్లే యుందురు. వీరు సర్వమును నిర్జించుచు, సత్యమందక ఎండిన వడియములవలే జీవింతురు. వారి మనస్సు పుణ్య పాపములనే ఎక్కువగ చూపించును. వారు జన స్రవంతిలో (చైతన్యములో) కలసి మెలసి యుండలేరు.''

యువ సన్యాసి చటుక్కున సభనుండి లేచెను. మౌనముగ సాగిపోయెను. బుద్ధుని ప్రసంగము అతనిని కలవర పరచినది. ఆత్మావలోకనము ప్రారంభమైనది.

యువసన్యాసి ఆత్మావలోకనము యిట్లుసాగినది. ‘‘సన్యాసి నవ్వలేడు. సన్యాసి నర్తించలేడు. సన్యాసి కొన్నిటిని నిర్జించడు. మరికొన్నింటిని వర్జించును. కొన్నింటిని ప్రత్యేకముగ ఆదరించును. ధన సాంగత్యము, స్త్రీ సాంగత్యము గర్హించును. సన్యాసి ఈ విధముగ ద్వంద్వమున చిక్కినవాడే.

‘‘తాను వర్జించినవి, నిర్జించినవి, విసర్జించినవి తనయందు అప్పుడప్పుడు మొలకెత్తుచునే యున్నవి. మొలకెత్తినపుడెల్ల తాను వానిని పాషండముగ అణచివేయుచున్నాడు. తనకు రాజరికపు జీవన సౌఖ్యములు గుర్తువచ్చుచునే యున్నవి. అణచుకొనుచునే యున్నాడు. భోగవస్తువులను వర్జించి, సన్యాస మను రెండుజతల కాషాయ వస్త్రములను, చివికినవి, చిరిగినవి ధరించి యున్నాడు. లంగోటి, కమండలము, దండము అలంకారప్రాయములైనవి. దేహాభిమానము వుండకూడదని తన శరీరముతో తానే నిత్య పోరాటము చేయు చున్నాడు. ఇంద్రియములను, శరీరమును ఎండబెట్టుచున్నాడు. గౌతమ బుద్ధుడు తనను వుద్దేశించియే సన్యాసులు ఎండు వడియములవలె రసహీనముగ జీవింతురు అని పలికినాడు. నా యందలి పోరాటమును నాకు చూపినాడు.

“సన్యాసము తా నెన్నుకొన్నది. తాను కోరుకొన్నది. ఈ కోరుటకును, రాజభోగములను కోరుటకును కోరుటయే కారణము. కోర రాదనుకొనుట కూడ కోరికయే. ఇట్లుండవలెను, యిట్లుండ కూడదు అను రెండునూ కోరికయే. ఉండుటయే సత్యము. కోరుట అసత్యమున త్రోయును. ‘యదృచ్ఛా లాభ సంతుష్టః’ యని శ్రీకృష్ణుడు భగవద్గీత యందు తెలిపినాడు. జీవితమున లభించిన దానియందు దైవమును దర్శించుచు ఆనందించుమని ఇపుడు గౌతమ బుద్ధుడు మరల హెచ్చరించినాడు. తాను నిర్వర్తించుచున్న ఈ సన్యాస పోరాటము తనకిపుడు యొక చలన చిత్రమువలె గోచరించుచున్నది. సన్యసింపనిచో రాజరిక పోరాటము సాగించెడి వాడు. ఇపుడు తనతోనే తనకి ఎడతెరపిలేని పోరాటము. గౌతముడు పోరాటము సలిపి, పోరాట మనవసరమని తెలుసుకొని బుద్ధుడైనాడు. శ్రీకృష్ణుడు ఎప్పుడునూ పోరాడలేదు. అతడు పోరాటములందున్నప్పుడు కూడ అతనికి పోరాటబుద్ధి లేదు. అత డన్నిటియందున్నాడు.”

శ్రీకృష్ణుడు యుద్ధము నందున్నాడు. కాని యుద్ధములో సంగము లేదు. రాజకీయముల యందున్నాడు. కాని సంగము లేదు. కీర్తి అంది వచ్చినది. అందు జీవించలేదు. అపనిందల పాలైనాడు. అందునూ జీవించలేదు. దేనితోను సంగమించక సమస్తము నందుండుట అతని యోగవైభవము. స్త్రీ సాంగత్యము తాను కోరలేదు. స్త్రీలు కోరిన కాదన లేదు. పాండవపక్షము తాను

కోరలేదు. అర్జునుడు కోరిన కాదన లేదు. అతడు దేనియందును వ్యామోహ పడలేదు. దేనిని వర్జించలేదు. బుద్ధుడు చెప్పిన వుండుట అనగా నిదియే యనిపించు చున్నది.

తాను కూడ అట్లు సంగము లేక యుండగలడా? దైవమును చూచిన సంగముండదు. సంగముండిన దైవముండడు. అసంగమే అస్త్రము. అసంగ మనగా దైవముతో సంగము. ఇతర ఏ సంగము లైనను మాయయే. దైవ సంగమే సత్యము. అదియే "అ" తో సంగము, అసంగము.

యువ సన్యాసి మనస్సున తరంగములు తరంగములుగ ఒకే భావము వుద్భవించుచున్నది. అది "అసంగము". బుద్ధుడు తెలిపిన అసంగము సమన్వయాత్మకముగ నున్నది. సన్యాసియైనను, సంసారియైనను, గృహస్తుయైనను, వానప్రస్థుడైనను అసంగము ద్వారా సంఘమున దివ్యానుభూతి పొందుటకు అవకాశమున్నది. సంగము లేనివానికి అన్నిటియందు దివ్యవర్తనమే గోచరించగలదు. అతడపుడు ధర్మానుసారముగ ఏపని చేసినను అందలి దివ్యాను వర్తనమే మిగులును. అట్టి వానికి నీచవృత్తి యని యుండదు. ఇదియే భరత సంప్రదాయమున స్పష్టముగ గోచరించినది.

"తాను అసంగమము నవలంబింపవలెను. అసంగమనగా "అ"తో సంగమము. "అ" అను అక్షరము "నేను" అని దైవము గీతలో పలికినాడు. అన్నిటి యందలి దైవముతో సంగమే "అసంగము".

ప్రస్తుతము నాకు ప్రత్యక్ష దైవము బుద్ధుడు. బుద్ధుని ఆశ్రయించెదను" అని భావించి సన్యాసి వెనుకకు తిరిగెను.

యువ సన్యాసి బౌద్ధ ఆరామమును మరల చేరెను. అప్పటికి బుద్ధుని ప్రసంగము ముగిసినది. జన సమూహము మరలినారు. గౌతమ బుద్ధుడు విశ్రాంతి గొనుచున్నాడు. యువ సన్యాసి బుద్ధుని ముఖ్య భిక్షుకుని కలిసి తాను గౌతమ బుద్ధుని సాన్నిధ్యము కోరు చున్నానని, ఈ విషయము బుద్ధునికి తెలియచేయవలసినది యని వినయముగ తెలిపెను. బౌద్ధ భిక్షువు వెంటనే బుద్ధుని కలసి, అనుమతి బడసి యువ సన్యాసిని లోనికి గోనిపోయి మరలివచ్చెను.

యువ సన్యాసి గౌతమ బుద్ధుని చూసి వినమ్రుడై నమస్కరించి తన ఆవేదనను ఇట్లు తెలియచేసెను. "త్వరపడి సన్యసించితిని, మీ ప్రసంగము విని కలవరపడితిని. కలవరము నుండి పరిష్కారము లభించినది. అది మీ సాన్నిధ్యమే. మీ సాన్నిధ్యమున నా జీవితమును పరిపూర్ణము గావించుకొన నిశ్చయించుకొంటిని. ఇది అంతయు మీ అనుగ్రహమున మాత్రమే జరుగగలదు. మీ అనుమతికై వేచి యుందును. మీరు తెలుపు యే పనియైనను నిర్వర్తించెదను."

# ౨

గౌతమ బుద్ధుడు యువ సన్యాసి పలికిన పలుకులను శ్రద్ధగా వినెను. అతని వినయము, బుద్ధునికి విస్మయముతో కూడిన ఆనందము కలిగించినది. విస్మయమునకు కారణము అతడు రాజవంశీయుడు. క్షాత్ర ధర్మము జన్మతః అతని స్వభావము. క్షత్రియునికి అహంకారము అలంకారము మరియు భూషణము. చిన్న వయసుననే క్షాత్ర ధర్మమును అధిష్ఠించి సత్వపు పొలిమేరలలో ప్రవేశించిన యువ సన్యాసి యొక్క సంకల్ప బలమును, దీక్షను, దక్షతను గుర్తించెను. విస్మయము చెందెను. అతని వినయపూర్వక భాషణము ఆనందము కలిగించెను. బుద్ధుడు మందస్మితముగ యిట్లు పలికెను.

“జరిగినదేదో జరిగినది. ఇకపై నీకు లభించిన అసంగాస్త్ర మును నీ జీవితముపై ప్రయోగింపుము. అది నా సాన్నిధ్యమున నీవు నిర్వర్తించుకొన్నచో నీకు బలము కలుగునని భావించితివి. అట్లే అగుగాక! సంఘమున నీవు చేరుటకు కూడ అనుమతించెదను. బుద్ధ సంఘమునందు కూడ సంసారమున్నది. నీవు బుద్ధ సంఘ మున బుద్ధ సంగమును కోరుము. అట్లు కానిచో యిసుక తక్కెడ నుండి పేడ తక్కెడలో పడినట్లుండును.”

“మరియొక విషయము, అసంగ సాధనమున నిరాకరణము లేదు. సృష్టి యందలి విషయముల ఆకర్షణ లేదు. నీవు నిరాకరించు నపుడు దైవమును కూడ నిరాకరించగలవు. దైవమును నిరాకరించక దానిపై క్రమ్మిన మాయా విషయము మృదువుగ నిరాకరించవచ్చును. అనగా జీవ నిరాకరణమును చేయ తగదు. వారి స్వభావముల ప్రభావమును సున్నితముగ నిర్జించవచ్చును. అట్లే ఆకర్షణ విషయము కూడ. ఆకర్షించు విషయమందలి దైవముతో అనుసంధానము చెంది, ప్రకృతి ఆకర్షణలకు లోనుకాకుండగ జీవించవలెను. అసంగ జీవనము సూక్ష్మము, సున్నితము. నిర్వర్తించు సాధకుడు అప్రమత్తుడై యుండ వలెను. హంసవలె క్షీరమును గ్రోలి నీరము నందు తేలవలెను. నీరమును నిరాకరించరాదు. ప్రతి జీవి క్షీరము వంటివాడు. అతని స్వభావము నీరము వంటిది. నీరము నధిష్ఠించి, క్షీరమును గ్రోలుట హంస ప్రవృత్తి. నీవు స్ఫూర్తి చెందిన అసంగ సాధన సర్వోత్కృష్ట మైనది. దీక్షతో నిర్వర్తించుకొనుము. నీకు శుభమగు గాక!”

యువసన్యాసి అసంగదీక్షను బుద్ధుని వద్ద స్వీకరించి బుద్ధ సంఘమున తన కందివ్వబడిన కర్తవ్యములను నిర్వర్తించు చుండెను. కర్తవ్య నిర్వహణమున అతని ఏకాగ్రత, భక్తి, శ్రద్ధ, నిపుణత బుద్ధుని కానందము కలిగింపసాగినది. అతడు సంఘమునందలి భిక్షుకు లతో సన్నిహితముగ మెలగసాగెను. భిక్షుకుల సంభాషణము అర్థవంతమైనచో అందు పాల్గొనుచుండెను. కానిచో సున్నితముగ మౌనము వహించుచుండెను. ఏకాంతము దొరికినప్పుడెల్ల ధ్యానము

కావించుకొను చుండెను. క్రమముగ అతని ప్రవర్తనమున సద్గురు వాశించు పరిణామము కలుగసాగినది. అతనికి బౌద్ధ సంఘమున ఎవ్వరితోను విభేదము లేదు. తన కేపని అందించినను స్ఫూర్తితో నిర్వర్తించుటయే కాని పెద్దపని, చిన్నపని అను భావము లేదు. నిద్ర, ఆహారము విషయములయందు లభించిన దానికి సంతుష్ఠి చెందుచు జీవించుచుండెను. సంఘమున అతని కర్తవ్యముల యందు, సంఘ సభ్యులయందు, ఆహార నిద్రా విషయముల యందు దైవముతోనే సంగము ఏర్పరచుకొనెను. అట్లగుట చేత ధ్యానమున దైవ సంగము సులభముగను, శీఘ్రముగను ఏర్పడు చుండెడిది. అతడు గంటల తరబడి నిశ్చలముగ ధ్యాననిమగ్నుడై యుండుట చూచిన వృద్ధ భిక్షకులు ఆశ్చర్యము చెందుచుండిరి.

బౌద్ధ భిక్షుకులలో ఉత్తమశ్రేణి భిక్షుకులను సమీప నగరములు, గ్రామముల యందున్న కుటుంబముల వద్దకు పోయి భిక్షను యాచించి తెచ్చుట కర్తవ్యముగ నీయబడును. అట్టి కర్తవ్యమునకు యువ సన్యాసి (అసంగుడు)ని ఎన్నుకొనిరి. అతడు సమీప నగరమున భిక్షను కొనితెచ్చుటకై నియమింపబడెను. నగరమున ప్రవేశించిన అసంగుడు అచటి నగరవాసుల జీవన విధానమును గమనించుచు, అసంగదీక్షను కొనసాగించుచు భిక్షాటనము గావించెడివాడు.

స్ఫురద్రూపి, యవ్వనవంతుడు, బంగారుఛాయ దేహము కలవాడు, సర్వాంగ సుందరుడు అగు అసంగుడు నగర వీధులలో

భిక్షాటనము చేయుచుండగ ప్రజలు తన కాకర్షితులైరి. భిక్షాటనా కర్తవ్యమునందును, ప్రజల ప్రశంసల యందును దైవమునే దర్శించుచు నిమిత్తమాత్రముగ అతడు గడుపు చుండెడివాడు.

ఒకనాడు అసంగుడు నగరమున భిక్షాటనము చేయు చుండగా నగరవీధులలో బంగారు పల్లకీలు మణి మాణిక్యములతో, వజ్ర వైడూర్యములతో రక్షక భటులు సంరక్షించుచుండగ సాగిపోవు చున్నవి. వాని వెనుక మరికొన్ని బంగారు పల్లకీలలో చిత్ర విచిత్రము లైన బంగారు ఆభరణములు తరలిపోవుచున్నవి. వాని వెనుక వెండి ఆభరణములు, యితరములైన విలువగు వస్తు సామాగ్రి పల్లకీలలో సాగిపోవుచున్నవి. ప్రజలు గుంపులు గుంపులుగ చేరి ఊరేగింపుగ సాగిపోవుచున్న పల్లకీలలోని అత్యంత విలువైన మణిమాణిక్యము లను, వజ్ర వైడూర్యములను, బంగారు నగలను, వెండినగలను చూచుచు కోలాహలముగ నున్నారు. అందరి ముఖముల నుండి "ఆమ్రపాలి" ఆభరణాలు! రత్నాలు! మణులు! వెండి సామగ్రి! అను వాక్కులు వెలువడుచున్నవి. కన్నుల నుండి జీవ చైతన్యము ప్రవహించి సామాగ్రిని స్పృశించుచున్నది. కన్నులు ఆశ్చర్యముతో నిశ్చేష్టములై తెరువబడి యున్నవి. కొందరు బంగారు పల్లకీలను చూచిరి. కొందరు రత్నములను చూచిరి. మరికొందరు మణులను చూచిరి. అట్లు చూచుచు కనబడుచున్న వస్తువుల మైకము చెందిరి. ఏ నోటవిన్నా "ఆమ్రపాలి"యే. ఇది గమనించుచున్న అసంగునికి ఆశ్చర్యము కలిగినది. ఇన్నివేల ప్రజలను మైమరపింపగల ఆమ్రపాలి

ఎవరా? అను భావము కలిగి పల్లకీల వెనుక సాగివచ్చుచున్న మరియొక పల్లకీని చూచెను. అచట ప్రజలు మరీ కోలాహలముగ నున్నారు. ఆమె కూర్చుండిన పల్లకి అత్యద్భుతముగ నుండెను. ఆమె వైభవము చక్రవర్తుల వైభవముతో సరిసమానముగ నున్నది. ప్రజలు ఆమెను గురించి యిట్లు ప్రశంసించుకొనుచుండగ అసంగుడు వినుచుండెను.

"ఆమ్రపాలి వంటి అందాలరాశి భూమిపై ఎక్కడను వుండదు. ఆమె కనుసన్నల సైగలకు రాజులు, రారాజులు, అధికారులు, ధనవంతులు, సన్యాసులు సైతము మైమరతురు. పద్మిని జాతి స్త్రీ యనగా ఈమెయే. ఈమెకు గల అధికారము, సంపద, వైభవము, స్వతంత్ర విహారము ఎవరికి గలదు? చక్రవర్తి యైనను ఈమె యంత స్వతంత్రము కాదు. ఈమెకున్న వైభవము అధికారులకు కాని, ధనికులకు కాని లేదు. సన్యాసులకు కూడ యిట్టి స్వతంత్రము, వైభవము వున్నదనిపించదు. ఈమె అందము వర్ణనాతీతము. సృష్టికర్త ప్రత్యేక శ్రద్ధతో ఈమె సమస్త అంగములను, ఉపాంగములను తీర్చిదిద్దినట్లు గోచరించును. ఆమ్రపాలి మేనిఛాయ బంగారు కాంతులీను చుండును. ఈమెది సహజ సౌందర్యము. శాపవశాత్తు భూమికి దిగిన అప్సరస అయి వుండవలెను."

ఇట్లు ప్రశంసింపబడుచున్న ఆమ్రపాలిని గూర్చి వినిన అసంగుడు ఆమె అందమును ఒక్కసారి చూడవలెనని సంకల్పించి,

ఒక ఎత్తైన ప్రదేశమున నిలబడి ఆమెను చూచెను. ఆమె ప్రజల వైపు ఠీవిగ చూచుచు, వారి ప్రశంసలను వినుచు, గర్వము చెందుచు సాగిపోవుచున్నది. ఆమె చూపులు తనను చూచుచున్న అసంగునిపై ప్రసరించినవి. వారి చూపులు కలసినవి. అసంగుడు మర్యాద పూర్వకముగ తలవంచి ఆమ్రపాలి అందమును గౌరవించెను. అతని చూపులు ఆమెయందు ఒక క్రొత్త కలవరము కలిగించినది. వేలాదిగా ప్రజలు సంవత్సరముల తరబడి తన అందమును చూచి మోహితులై చూచు చూపులు ఆమెకు తెలిసినవే! అసంగుని చూపు వినూత్నముగ నుండెను. అదియేమో, ఆమెకు తెలియలేదు.

# 3

నగరవీధులలో ఊరేగింపుగ సాగిన ఆమ్రపాలి తన నివాసానికి చేరుకున్నది. నెలకొకసారి ఒకరోజు తాను చక్రవర్తితో గడుపుతుంది. తిరిగి వచ్చేటపుడల్లా చక్రవర్తి తన సంతోషాన్ని వెలిబుచ్చుతూ విలువైన రత్నాలు, మణులు, ఆభరణాలు, అపురూపమైన దుస్తులు ఇచ్చి పంపుతూ వుంటాడు. చక్రవర్తి నుండి నగరములోని బిచ్చగాని వరకు తనని ఆపాద మస్తకము వేయి కనులతో చూస్తూ వుంటారు. తన అందానికి ఆకర్షితులై, సమ్మోహితులై గుడ్లు వెళ్ళబెట్టుకొని తనని చూచేవారి నందరిని చూచి చూడనట్లుగ వారి అవస్థకు లోలోన నవ్వుకొనుచు గర్వముతో హుందాగా తాను జీవిస్తూ వుంటుంది. తనకు ప్రపంచమందలి విలువైన వస్తువులన్నీ ఎందరెందరో సమర్పిస్తూ వుంటారు. తనకి లేనిది లేదు. జీవితమంతా వైభవోపేత ముగా నడుస్తూ వుంది. నగరములో చక్రవర్తి రాజభవనము తరువాత అంత వైభవోపేతమైన భవనములో తాను నివసిస్తూ వుంది. భవనము చుట్టూ వంద ఎకరాల పూలతోటలు, పండ్లతోటలు వున్నాయి. ఉద్యానవనా లున్నాయి. లేళ్ళు, జింకలు, నెమళ్ళు యితరములైన రమ్యమగు జంతువులు, పక్షులు తనకున్నవి. ఏనాడు దేనికి లోటులేని జీవనము. తాను కోరితే తీరని కోరిక లేదు. అందరూ తన అందానికి దాసులే అయినప్పటికి ఆమ్రపాలి తనను తన

అద్దమందు చూచుకొన్నప్పుడు తన ఒంటరితనము తనకు గుర్తువస్తూ ఉంటుంది.

ముందు తన అందాన్ని చూచి మురసిపోయే ఆమ్రపాలి తన కన్నులలోనికి తాను లోతుగా చూచినప్పుడెల్ల ఒక వెలితి కనపడుతూ వుంటుంది. ఆ భావము పరిసర ప్రపంచము నుండి తనని దూరము చేస్తుంది. “తాను ఏకాకి, అందరికిని తన అందము మీద మోహము. తననే మోహింపచేసే తన అందము యితరులను మోహింప చెయ్యటములో ఆశ్చర్యము లేదు. అందరూ కోరుకునేది తన దేహ సౌందర్యమే. నిజానికి తాను ఎవ్వరికిని అక్కరలేదు. తన దేహమే కావాలి. తాను పగలు సంఘం దృష్టిలో వేశ్య. రాత్రి అందరికి తాను అప్సరస. రాత్రిపూట తన నంతగ ఆదరించేవారు, అక్కున చేర్చుకొనేవారు, కల్లబొల్లిమాటలు చెప్పేవారు పగలు తనను చూచి మొహము చాటేసుకుంటారు. వారి భార్యలు వారితో నున్నప్పుడు ఏకపత్నీ వ్రతులవలె తానెవరో తెలియనట్లు నటిస్తూ వుంటారు. ఆ సమయములో తనని చూడటానికే భయపడతారు. పైగా, భార్యల మెప్పులు పొందటానికి నా వృత్తిని గూర్చి, జీవనాన్ని గూర్చి నీచముగా మాట్లాడుతారు. శీలమును గూర్చి, ధర్మమును గూర్చి, దైవమును గూర్చి ఉద్బోధలు చేసే పండితులు, మతాధికారులు కూడ దొంగ చాటుగ రాత్రి సమయములో తన దేహ సౌందర్యాన్ని ఆస్వాదించా లని ఉవ్విళ్ళూరుతూ వుంటారు. నిజానికి ఈ సంఘజీవుల బలహీనత వికారముగా ఇలా నృత్యము చేస్తూ వుంటుంది. సంఘములోని పెద్దవారికి సైతము త్రికరణశుద్ధి లేదు. తనను కోరినవా రెవరూ

లేరు. అందరూ తన దేహాన్ని కోరేవారే. తనని కోరేవా రెవరూ లేరు. తనను వాడుకొని అటుపైన సంఘములో నీచముగా తనను గూర్చి మాట్లాడుతారు. ఇది సగటు మానవజాతి తత్త్వము. చక్రవర్తి కూడ ఈ విషయములో సగటు మనిషే.

తన చుట్టూ యిందరున్నా తన కెవరిమీద రుచి లేదు. ఏ ఒక్కరి మీద ఆత్మీయ భావము లేదు. అందరూ పాశవికులై తన దేహాన్ని వాడుకొని డబ్బు, విలువైన వస్తువులు యిస్తూ వుంటారు. తన హృదయము మాత్రము ఏ ఒక్కరియందు తగుల్కొన లేదు. హృదయగతురాలుగ తాను ఈ రోజుకీ కన్యయే. దేహగతురాలుగ తాను వేశ్య.

ఆమ్రపాలికి సంవత్సరములు గడుచుచున్న కొలది యీ భావ పరంపర తీవ్ర మగుచున్నది. ఆమెకు తాను వేరు, తన దేహము వేరు అను భావము స్థిరపడసాగినది. తనకు తోడు కావాలి. తన దేహానికి గల వన్నీ తనకు రుచించటము లేదు. తనదొక తపన. అది ఒక తపస్సు.

ఆమ్రపాలి దీర్ఘాలోచనము, ఏకాంతమున పై విధముగా సాగుతూ వుండెడిది. ఆమెకు యిన్ని సంవత్సరముల వైభవోపేత జీవనములో అంతకంతకు సత్యము తక్కువని, అసత్యమే ఎక్కువని తెలియసాగినది. తన వైభవమంతా తన కేర్పడుటకు తన దేహ సౌందర్యమే కారణము. ఆ వైభవము తనది కాదు. తన దేహమును ప్రేమించుచున్నవారు, వయస్సు మళ్ళిన తరువాత తనను ప్రేమించు

దురా? ప్రేమింపరని స్పష్టముగ తెలియుచున్నది. తనను ప్రేమించు వారెవరైన కలరా? అని ప్రశ్నించుకొనినప్పుడెల్ల, ఆ ప్రశ్న ఎప్పటికిని సమాధానము లేకయే నిలచును. తన దేహమును ప్రేమించు వారందరును కాముకులే గాని నిజమైన ప్రేమికులు కాదు.

నిజమునకు ధనవంతునిపైన చూపు గౌరవము, అభిమానము, ప్రేమ అతని ధనము నాశించియేగాని అతనిని ఆశించి గాదు. ధనవంతుని కది తెలియదు. తాను ధనవంతుడనని భావించుట చేతనే అట్టి మోహమున పడియుండును. అధికారుల పరిస్థితికూడ ఇదియే. వారి అధికారమును తమకు వినియోగించుకొనుటకై, బెల్లము చుట్టూ చీమలవలె చేరుదురు. చక్రవర్తి పరిస్థితి కూడ ఈ విధముగనే యుండును. పండితులు, విద్యావంతులు సంఘమున పొందు ఆదరము వారి పాండిత్యమునకు, విద్యకే కాని వారికి కాదు.

నిజమున కీ ప్రపంచమున ప్రేమ, అభిమానము, ఆదరము వెనుక ఆశించుట, ప్రత్యుపకారమునకై ఎదురు చూచుట ఎక్కువుగ నున్నది. సామాన్యముగ పరస్పర ఆదరాభిమానము లన్నియు, సకారణములే. "నిన్ను నిన్నుగ ప్రేమించు వాడెవడైన కలడా?" అని పరిశీలించుకొన్నచో సమాధానమొందుట కష్టము. ఆమ్రపాలికి ఈ ప్రశ్నయే పదేపదే తారసిల్లుట జరుగుచున్నది. దేహయాత్ర యాంత్రికముగ జరుగుచున్నది. జీవిగ ఆ యాత్రయందు తనకు మోజు పోయినది. నిష్కారణమగు ప్రేమ యుండునా? అను ప్రశ్న జీవుని శోధనమున, పరిశోధనమున, అన్వేషణమున నిలిపెను.

ఈ రోజు తనను వెఱ్ఱిగ చూచిన వేలాదిమంది ప్రజలలో బౌద్ధభిక్షువు చూపు తన కన్నుల నుండి లోనికి ప్రవేశించి హృదయము ను స్పృశించెను. అతడు తనకు విశిష్టముగ గోచరించెను. మరల మరల అతడే జ్ఞప్తికి రాసాగెను. అతని చూపులు తానెరిగిన కాముకుల చూపులకన్న వేరుగ నున్నవి. ఆ చూపులలో శాంత మున్నది. గాంభీర్య మున్నది. నిర్మలత్వ మున్నది.

అతడు గౌరవపూర్వకముగ తనకు శిరస్సు వంచి నమస్క రించినాడు. అతడు అట్లు చేయవలసిన అవసరమే లేదు. దేహము నిండ కన్నులు పెట్టుకొని తనను చూచువారేకాని, యిట్లు గౌరవ పురస్సరముగ చూచినవారు లేరు. ఆ బౌద్ధ భిక్షుకుని చూపు తన దేహమున కే విధమైన చికాకు కలిగించలేదు. ఇతరుల చూపుల చికాకులు తనకు తెలిసినవే. అతడు నాయందేమి చూచి గౌరవించెను? నిస్సందేహముగ నా దేహ సౌందర్యమును చూచి మాత్రము కాదు. అతడు భిక్షువు, సన్యాసి, తపస్వి. ఇతరులవలె చూడడు కదా! దొంగ సన్యాసుల చూపులు తనకు పరిపాటియే, అవగతమే. ఇది యట్లుకాదు. అతడొక్కసారి మరల తనకు గోచరించిన బాగుండునని భావించుచు ఆమ్రపాలి ఆ దినమునకు విశ్రమించెను.

# 4

ఎప్పటివలెనే అసంగుడు తన సహాధ్యాయులతో కలసి నగరమునకు భిక్షకు బయలుదేరినాడు. నగర పొలిమేరలలోనే ఒక విశాల భవనము, దాని నావరించియున్న అతి విశాల ప్రాంగణము గోచరించినవి. ద్వారము వద్ద భిక్షాపాత్ర నిడుకొని, మిత్రులతో సహా వేచి యుండెను. అచ్చటగల సేవకులు భవనములోనికి పోయి బౌద్ధ భిక్షువులు, భిక్షకై వచ్చిరని తెలియజేసిరి. లో నుండి ఆమ్రపాలి వడివడిగా దాసిజనమును గొని ప్రాంగణ ద్వారము వైపునకు నడువసాగినది. భిక్ష వేయుటకు వలసిన సామాగ్రి అంతయు తరలి వచ్చుచుండగ, తాను తొట్రుపాటుతో, ఆనందముతో సాగిపోవు చున్నది. తన హృదయ స్పందనము బాగుగ పెరిగి శ్రవణేంద్రియము లకు బహిర్ముఖముగనే వినిపించుచున్నది. దేహము కన్న జీవము ముందుగ సాగినది.

దూరము నుండి వచ్చుచున్న స్త్రీ సమూహమును, ముందుగా నడచి వచ్చుచున్న ఆమ్రపాలిని చూచి బౌద్ధ భిక్షువులు కొంత కలవరము చెందిరి. తమలో యిట్లని గుసగుసలాడిరి.

“ఈమె ఆమ్రపాలి యను నామము గల వేశ్య. అత్యంత

ప్రాభవము కలది. వేశ్యాగృహమున భిక్ష నందుకొనుట శ్రేష్ఠము కాదు. మనము తరలిపోవుదము. ఈమె భిక్షను స్వీకరించినచో ఆమె అపవిత్రత తమ నంటగలదు. తమ సాధన భంగము కాగలదు.'' అని భావించుచు భిక్షుకులు ముందుకు సాగుటకు నిశ్చయించు కొనిరి. అసంగుడు మాత్రము అచ్చటనే నిశ్చలముగ నిలచెను. వారు హెచ్చరించినను కదలలేదు. అతనిని వదలి వారు సాగిరి. అతడచ్చటనే భిక్షాపాత్రను దక్షిణహస్తమున ధరించి నిలచెను.

ఆమ్రపాలి అసంగుని సమీపించినది. అతని కన్నులలోనికి చూచినది. నిశ్చలమగు అసంగుని కన్నులనుండి శాంత గంభీరమగు చూపులు మరల ఆమ్రపాలి హృదయమును స్పృశించినవి. ఆమె హృదయము ద్రవించినది. అప్రయత్నముగ మోకరిల్లి, పాదములకు నమస్కరించినది. తన్మయత్వముతో పాదములను కడిగినది. పుష్పములతో పూజించినది. అసంగుడు ఆమె భక్తి పారవశ్యమునకు ఆశ్చర్యము నొందినాడు. ఆ స్త్రీమూర్తిని మరల చూచినాడు. శిరస్సు వంచి భిక్షము నర్థించినాడు. ఆమ్రపాలి వినయపూర్వకముగ బౌద్ధ భిక్షువు నిట్లని అర్థించినది.

``మా గృహమునకు విచ్చేయుడు. ఈ దినమంతయు మీ సాన్నిధ్యము ప్రసాదింపుడు. మీ పాదస్పర్శచే నన్ను, నా గృహమును పావనము చేయుడు. మీ దీక్షకు నేనెట్టి భంగమును కావింపను. మీ పాద సేవనమున నాకు కలుగు ఆత్మానుభూతి మోడువారిన ఈ జీవితమునకు తొలకరి చినుకువలె అమృతవర్షిణి కాగలదు.

"నా జీవితమున నే నెవరిని ఏదియు అర్థించినది లేదు. నన్ను అర్థించినవారి కందరికిని వారు కోరినది సమర్పించితిని. మీ వద్ద నేను యిట్లు ప్రాధేయపడుటకు అభిమానము పడుటలేదు. మిమ్ముల నభ్యర్థించుట ఆనందముగనే యున్నది. మీ రనుగ్రహింతురని భావించుచున్నాను."

అసంగుడు ఆ స్త్రీమూర్తిని, ఆమె సౌజన్యమును గ్రహించి, ఆమె యందు రెట్టించిన గౌరవమును పొందెను. ఆమె బాహ్యముననే గాక అంతరమున కూడ సౌందర్యమూర్తియే, సౌజన్యమూర్తియే. అతడు ఆమె కన్నులలోనికి చూచుచు, "అట్లే అగుగాక!" అని పలికి ప్రాంగణములోనికి అడుగిడెను.

సహాధ్యాయులగు బౌద్ధ భిక్షుకులు దూరమునుండి సమస్తమును దర్శించు చుండిరి. భవనమునుండి వేశ్యవనిత రావటము, పటాటోపముతో అసంగుని పాదసేవనము చేయటము, మోకరిల్లటము చూచిరి. అసంగుడు ఆమె ప్రాంగణములోనికి ప్రవేశించటము చూచిరి. ఉలిక్కిపడిరి, కలవరపడిరి. వారిని క్రోధము ఆవరించెను. "ఛీ ఛీ! ఇంత నీచత్వము కలిగి బుద్ధ భగవానుని ఆశ్రమమున కపటోపాయముతో అసంగుడు జీవించుచున్నాడు. ఈనాటి ఇతని ప్రవర్తనము ఏహ్యము. మనబోటి వారి ఊహలకు కూడ అందనిది. మన మీ విషయము గురుదేవులకు తప్పక విన్నవించవలెను" అని రకరకములుగ అసభ్య భాషణము చేయుచు

నగర ప్రవేశము చేసి, త్వరితగతిని భిక్షాటనము గావించి ఆశ్రమము నకు పోయిరి.

బౌద్ధ భిక్షుకులు హుటాహుటిన గౌతమబుద్ధుని కుటీరమున కేగి వారితో సంభాషించుటకు అనుమతిని కోరిరి. గౌతముడు అనుమతి నొసంగెను. శిష్య సమూహము లోనికి ప్రవేశించి యిట్లు వినయ విధేయతలతో విన్నవించిరి.

"స్వామీ! మీ ముందు ఒక ముఖ్య విషయమును విన్న వించుటకు ఏతెంచితిమి. ఈ దినమున ఒక మహాపచారము జరిగినది. అది మన ఆశ్రమము నంతయు అపకీర్తిపాలు చేయగలదు. అపవిత్రతతో మేము చేయు సమస్త సాధన వ్యర్థము కాగలదు. పశ్చాత్తప్త హృదయములతో మేము మీవద్ద నిలిచియున్నాము.

"ప్రతిరోజు వలనే ఈ రోజు కూడ ఉదయముననే ధ్యానాదులు కావించుకొని విధివిధానముగ నగరములోనికి భిక్షాటనమునకై బయలుదేరితిమి. మన సంఘములో నొకడగు అసంగుడు కూడ మాతో బయలుదేరెను. దారిలో ఒక విశాల భవన ప్రాంగణమున భిక్షకై నిలచితిమి. భవనములో నుండి ఒక వేశ్య పటాటోపముతో, పరిచారముతో మా వద్దకు వచ్చుచుండగ చూచితిమి. ఆమె చాల ప్రసిద్ధిగాంచిన వేశ్య. నీచవృత్తి ద్వారా జీవనమును సాగించుచు అనితర సాధ్యమైన ధనమును, ప్రాభవమును పొందినది. ఆమెను చూడగనే మేమందరము అచట నుండి వడివడిగ సాగిపోవుటకు

నిశ్చయించుకొంటిమి. అసంగుడు మాత్రము అచటే నిలిచి యుండెను. మేమెంత నచ్చ చెప్పినను అతడు మాతో యీవలకు రాలేదు.

"దూరము నుండి యేమి జరుగునో చూడవలెనను కుతూహలముతో అసంగుని ప్రవర్తనము కనిపెట్టుచుంటిమి. ఆ వేశ్య కపట వినయముతో, భక్తితో అతనికి పాదపూజ గావించెను. ఏమి కల్లబొల్లి మాటలు చెప్పినదో మాకు తెలియదు. మంత్ర ముగ్ధునివలె అసంగు డామెతో ఆమె గృహమున ప్రవేశించెను. మాకు చాల కలవరము కలిగినది. వడివడిగ మేము నగరమున భిక్షను గొని మధ్యాహ్న సమయమున తిరిగి వచ్చుచు వేశ్యాగృహ ప్రాంగణ ద్వారము వద్దగల కావలి వారిని విచారించగ, బౌద్ధ సన్యాసి యింకను గృహముననే యున్నాడని తెలిపిరి. మేము చూచినది చూచినట్లుగ తమకు తెలియపరచుచున్నాము. అటుపై నిర్ణయము తమదే."

బుద్ధుడు తన అంతేవాసులు చెప్పిన దంతయు శ్రద్ధగ వినెను. శాంత గంభీర స్వరముతో యిట్లనెను. "అతనిని రానిండు. విచారించెదను."

## 5

ఆమ్రపాలి అసంగుని తన గృహములోనికి సాదరముగ పూజ్యభావముతో ఆహ్వానించెను. తన పూజా మందిరమున అసంగుని ఒక ఉన్నత ఆసనముపై కూర్చుండబెట్టెను. మరల పాదసేవనము గావించెను. ఆమె చెలికత్తెలు అసంగునికి వింజామరలు వీచుచు నిలబడిరి. ఆమ్రపాలి యథావిధిగ అసంగునికి భిక్ష నొసంగెను. అసంగుడు తృప్తిచెంది భిక్షనుగొని ఆసనము నుండి లేచి నిలబడెను. ముందుకు సాగబోయెను. ఆమ్రపాలి వెంటనే అతని రెండు పాదములను గట్టిగ పట్టుకొని యిట్లు వేడెను.

‘‘సాయంకాలము వరకును మీరిచటనే యుండవలెనని ప్రాథేయపడుతున్నాను. మీ రంగీకరించి లోనికి వచ్చితిరి. ఈ దీనురాలిని కరుణింపుడు. సూర్యుడస్తమించకముందే మీరు తిరిగి ఆశ్రమము చేరవచ్చును. నేను మీ మౌనమునకు గాని, తపస్సునకు గాని అంతరాయము కలిగించనని, మీ దీక్షను భంగపరచనని మాట యిచ్చితిని. నాకీ వరము ప్రసాదింపుడు.’’

పై విధముగ పలుకుచుండగ ఆమ్రపాలి కన్నులనుండి నీరు ద్రవించి, ఆమె చెక్కిళ్ళమీదుగ ప్రయాణించి అసంగుని పాదములపై

పడెను. అసంగుని హృదయము ద్రవించెను. అచటనే కూర్చుండి పోయెను. తృప్తితో ఆమ్రపాలి కూడ పాదముల వద్ద ఆసీనురా లయ్యెను. వారిద్దరి మధ్యను ఏ భాషణము లేదు. అతడామె నొకమారు చూచి కనులు మూసుకొనెను. ఆమె అతని పాదములను స్పృశించి కనులు మూసుకొనెను. గృహమంతయు నిశ్శబ్దముతో నిలచినది. అట్లెంతసేపు గడచినదో తెలియదు. మధ్యాహ్నము దాటినది. సాయంత్రము అగుచుండగ అసంగుడు కన్నులు తెరచెను. లేచి నిలబడెను. ఆమ్రపాలి కూడ కన్నులు తెరచెను. అతడు బయలుదేరు సమయమైనదని గ్రహించెను. ఇట్లని పలికెను. ‘‘స్వామీ! నాకు మరియొక కోరిక కలదు. మీరు సహృదయులు. నా కోరికను నిరాకరింపరని ఆశతో వేడుకొను చున్నాను. మీ అనుజ్ఞ అయినచో తెలిపెదను.’’ అసంగు డది విని నవ్వి ఇట్లనెను.

‘‘నేను స్వతంత్రుడను కాను. పరాధీనుడను. బుద్ధభగవానుని ఆశ్రమవాసిని. ఆశ్రమ నియమములను స్వీకరించితిని. వాని నుల్లంఘించు కార్యము నిర్వర్తింపలేను. స్వతంత్రుడనైనచో నీకు మాట యిచ్చెడివాడను. ఈ రోజున నీ గృహప్రవేశము నేను చేసినను, నీవు నా నియమముల కంతరాయము కలిగింపలేదు. నీ సౌందర్యము, నీ సౌజన్యము అపురూపము. నీ వొసగిన భిక్షను పూర్ణహృదయముతో గ్రహించితిని. నీవు కోరిన విధముగ పగ లంతయు నీ యింట యుంటిని. మరల మరియొక కోరికయా?

ఆమ్రపాలి యిట్లనెను : "దాచుకొనకుండ నా హృదయము నందు కలిగిన సంకల్పమును విన్నవింతును. అటుపై నిర్ణయము మీదే."

అసంగు డిట్లనెను : అట్లయినచో నిస్సందేహముగ తెలుప వచ్చును."

ఆమ్రపాలి ఇట్లు తెలిపెను : "రేపటి నుండి యోగులు, మునులు, తపస్విజనులు నాలుగు నెలలపాటు చాతుర్మాస్య దీక్ష నవలంబింతురు. ఈ నాలుగు మాసములు వారెచటకును పర్యటింపరు. మీరు నిర్వర్తింపబోవు చాతుర్మాస్య దీక్ష నా గృహమున నిర్వర్తించుకొనుడు. నాలుగు నెలలపాటు మీ పాద సేవనము చేసుకొని పునీత నగుదును."

అసంగు డిట్లనెను : "గురుదేవులగు బుద్ధ భగవానునికి జరిగిన దంతయు విన్నవింతును. వారెట్లు నిర్ణయించిన అట్లు నిర్వర్తింతును. ఇక శెలవా?"

ఆమ్రపాలి లేచి నిలబడెను. సాదరముగ, పరివారముగ బహిర్ద్వారము వరకు వెంట నడచి సాగనంపెను.

అసంగుడు సూర్యాస్తమయానికి ముందే ఆశ్రమ ప్రవేశము చేసినాడు. సరాసరి బుద్ధుని కుటీరమును చేరినాడు. అచట వున్న సేవకులతో తాను గురుదేవుని చూడ సంకల్పించితినని తెలిపినాడు.

అనుమతిని కోరినాడు. అంగరక్షకులు, గురుదేవులు అతని కొఱకే నిరీక్షిస్తున్నారని, వెంటనే లోపలికి ప్రవేశించవచ్చునని అసంగునికి తెలిపినారు. అసంగుడు వారి వాక్యములతో సహాధ్యాయులు తనగురించి బుద్ధునికి తెలిపి వుండవచ్చునని భావించాడు. సూటిగా లోపలికి జని సద్గురువు పాదములకు నమస్కారము చేశాడు.

కుటీరము బయట కొంత కోలాహలముగ నున్నది. వారి గుసగుసలు లోపలికి కూడ వినిపించుచున్నవి. గౌతమ బుద్ధుడు అసంగుని కనులలోనికి సూటిగా చూసి "నీవీ రోజున నిర్వర్తించిన భిక్షాటన విశేషము లేమి?" అని ప్రశ్నించాడు.

**అసంగుడు** : ఈ దినము నేనొక పుణ్యమూర్తి గృహమున భిక్ష చేసితిని. ఆమె స్త్రీమూర్తి. అత్యంత సౌజన్యమూర్తి. అంతియే కాదు, అత్యద్భుత సౌందర్యమూర్తి కూడ. ఆమె ఈ పగలంతయు నా సాన్నిధ్యము కోరినది. నే నంగీకరించి ఈ దినమంతయు ఆమె నివాసమున నుంటిని. అచ్చటినుండి సూటిగ మీవద్దకు వచ్చితిని.

**బుద్ధుడు** : అంతియేనా? ఇంకేమైన విశేషములు జరిగినవా?

**అసంగుడు** : జరిగినవి. ఆమె రాబోవు చాతుర్మాస్య దీక్షను తన గృహమున నిర్వర్తించమని ప్రాధేయపడినది.

**బుద్ధుడు** : నీ వంగీకరించితివా?

**అసంగుడు** : అంగీకరించుటకును, అంగీకరించక పోవుటకును

నేను స్వతంత్రుడను కానని, పరతంత్రుడనని, గౌతమ బుద్ధుల ఆశ్రమవాసినని, వారి ఆజ్ఞ ప్రకారమే జీవింతునని తెలిపితిని.

**బుద్ధుడు** : నీ వేమని తలచుచున్నావు?

**అసంగుడు** : నే నేమియు తలచుట లేదు. మీరు ఎట్లు ఆనతిచ్చిన అట్లే నడచుకొందును.

**బుద్ధుడు** : చాలా సంతోషము. నీవు తప్పక రేపు ఉదయము ననే ఆ సౌజన్యమూర్తి గృహమున కేగి చాతుర్మాస్య దీక్షను నిర్వర్తించుకొని తిరిగి రమ్ము. అంతయు శుభమగుగాక!

అసంగుడు మరల సద్గురుమూర్తికి ప్రణమిల్లి కుటీరము నుండి బయలుదేరెను. బయట గుసగుసలు సద్దుమణిగినవి. బుద్ధుని శిష్యులలో కొందరు నిర్ణయమేమి జరిగినదో, ఇటుపై తమ కర్తవ్యమేమిటో తెలుసుకొనుటకై బుద్ధుని అనుమతి కోరినారు. బుద్ధు డనుమతించినాడు. లోనికి వచ్చిన వారితో బుద్ధు డిట్లనెను.

“అసంగుడు ఉన్నది వున్నట్లుగ నాకు సమస్తమును తెలిపినాడు. మీరు చూచినది వేశ్యను. అతను చూచినది ఒక సౌజన్యరాశి యగు స్త్రీమూర్తిని. అతని భావమున వేశ్య అను పదమునకు తావులేదు. మీరు చూచినది చూచినట్లుగ చెప్పుచున్నామంటిరి. మీరు చూచినది వేరు. అచ్చట వున్నది వేరు. ఉన్నది చూచుటకు నిర్మల

హృదయము కావలయును. కల్మష హృదయముతో సృష్టిని, సృష్టిజీవులను చూచువారికి కల్మషమే కనిపించును. అసంగుడు నిర్మల హృదయుడు. అతడు అందమును దైవముగ భావించువాడు, గౌరవించువాడు, పూజించువాడు. అతనికి సౌజన్యమగు స్త్రీ రూపమే గోచరించినది కాని మరియొకటి గోచరించలేదు.

అతనిని నేను నాలుగు మాసములపాటు ఆ స్త్రీ నివాసము ననే చాతుర్మాస్య దీక్ష వహించమని తెలిపితిని. అతడు రేపు ఉదయమే బయలుదేరును. మీరు కూడ త్రికరణశుద్ధితో రాబోవు నాలుగు మాసములు దీక్షను వహింపుడు. కల్మషమును నిర్మూలించు కొనుడు. మీకు శుభమగుగాక!"

భిక్షుల సంఘమంతయు విస్తుపోయింది. సద్గురువు పలుకులు విని అవమానముతో తలలు దించుకొనిరి. మరునాడు ఉదయమే అసంగుడు గురువాజ్ఞను పాలిస్తూ, చాతుర్మాస్య దీక్షకై ఆమ్రపాలి గృహమున కేగెను.

# 6

ప్రభాత కాంతులలో బంగారుఛాయ ఉట్టిపడుచుండగా ఒక పురుషమూర్తి ఉదయకాంతితో పోలిన ముఖవర్చస్సుతో కూడి తన గృహము వైపునకు సాగివచ్చుచున్నట్లు ఆమ్రపాలి తన మేడ పై అంతస్తు నుండి గమనించినది. ఆమె మనస్సు ఆనందముతో ఉప్పొంగినది. భిక్షువు రూపములో సాక్షాత్తు బుద్ధుడే కదలి తన యింటికి వచ్చుచున్నట్లుగా హృదయమున తోచి తన్మయత్వము చెందినది. వడివడిగా పరిచారికలతో ఎదురేగి అసంగుని సాదరముగ లోనికి ఆహ్వానించినది. అసంగుడు విశాల భవనము మధ్యమున ఒక ఉన్నతాసనమున కూర్చుండెను. ఆమ్రపాలి అర్ఘ్యమును, పాద్యమును, ఆచమనమును అందించినది. అసంగుని పాదముల వద్ద ఆశీనురాలై యిట్లని పలికినది. "ధన్యురాలను, నా ప్రార్థనను మన్నించి నా దేవుడు నా యింటికి వచ్చుటకు నిర్ణయించుకొనెను. ధన్యురాలను."

**అసంగుడు** : నిర్ణయము చేసినది నేను కాదు. దేవుడే. అతడే బుద్ధుడు. అతడే నిన్ను అనుగ్రహించెను.

**ఆమ్రపాలి** : మీరు నన్ను చూసినపుడెల్ల శిరస్సువంచి అభినందించిరి. దీని భావమేమి?

**అసంగుడు** : (నవ్వుచూ) నీవు అపురూప సౌందర్యవతివి. అందము దైవము యొక్క కానుక. దైవానుగ్రహములలో అంద మొకటి. దైవ విభూతులలో అందమును మించిన విభూతి లేదు. నీ యందు రూపుకట్టిన ఈ దైవ విభూతిని నేను దర్శించి గౌరవించుచున్నాను.

**ఆమ్రపాలి** : సంఘము దృష్టిలో నేనొక పతితను. నన్నందరును కోరుచుందురు. మరియు ఏహ్యాభావమును ప్రదర్శింతురు. సాధు సజ్జనులకు నా పొడయే గిట్టదు. ఆమడ దూరములో వైదొలగుదురు. ఒక విధముగ సంఘమున నే నస్పృశ్యను. పగలు నన్ను ద్వేషింతురు. రాత్రి నన్ను కామింతురు. అట్టి నా యెడల మీరు చూపు వాత్సల్యము నాకు ఆనందమును కలిగించుచున్నది. ఆశ్చర్యమును కూడ కలిగించుచున్నది. మీ అవగాహన నాకు తెలుపవచ్చునా?

**అసంగుడు** : నా దృష్టిలో సమస్తమును దివ్యమే. సృష్టియందు ఏహ్యము, నీచము అనునది చూచు వానిని బట్టి యుండును. సమస్తము నందును దైవము వ్యాపించి యున్నాడు. నేను వానిని, వాని విభూతులను మాత్రమే దర్శింతును. ఇతరములను దర్శించను. నీవు నాకు ఒక సౌజన్యమూర్తిగ గోచరించుచున్నావు. జీవిగా నీవు అత్యంత సంస్కారవతిగా నాకు గోచరించుచున్నావు.

> అన్నిటికి మించి పరిపూర్ణ స్త్రీమూర్తిగా కన్పట్టుచున్నావు. కనుక నాకు ఎట్టి అంతరములు మనసులో లేక నీవు కోరినట్లు నాలుగు మాసములు బస చేయుదును. నీ మనస్సునకు తోచిన విధముగ నీవు సేవనము గావించుకొనవచ్చును.

ఆమ్రపాలి సంతోషమున తేలికపడిన హృదయము కలదై అసంగునికి వలసిన దీక్షా సౌకర్యములను ఏర్పరచెను. అతనికి ప్రశాంతమగు విశాలమైన గది నేర్పాటు చేసెను. ప్రతిదినము అతనికి సేవ చేసుకొనుచుండెను.

జీవితమున తనను సరిగా అర్థము చేసుకొను ఒక పుణ్య పురుషుడు తనకు తారసిల్లెను. తన ఆంతర్యమును పరిపూర్ణముగ నెరిగిన సత్పురుషుడు తనకు సానిధ్యము నిచ్చుచున్నాడు. అతని లోదృష్టి తన మనసును తేలిక పరచినది. తనయందెట్టి ఏహ్య భావము గాని, కామముగాని లేని సత్పురుషు డతడు. ఇట్టి సాన్నిధ్యమును తా నెల్లపుడును అనుభవింపవలెను. నిజమునకు తన అంతరాత్మ యందుకూడ అసంగుడు తెలిపిన సత్యము తా నెరిగియున్నది. కామించువారు ద్వేషించుట తప్పదు. రాగ మున్న చోటనే ద్వేషము కూడ ఉండును కదా! తనకు జీవనపు లోతులు అనుభవ పూర్వకముగ తెలిసినకొలదియు, సత్యము క్రమముగ తెలియుచున్నది. తనకు కామము లేదు. కావున రాగము లేదు. రాగము లేదు గనుక ద్వేషము కూడ లేదు. ఈ సత్పురుషుని

యందు కూడ అట్టి ద్వంద్వములు లేవు. ఇతనికన్న తనను అవగాహన చేసుకొనువా రెవరు గలరు? ఈతనితో మిత్రత్వము శాశ్వత మయినచో ఎంత బాగుండును. ఆమ్రపాలి భావన పరంపర ప్రతిదిన మిట్లు సాగుచు అసంగుని సాంగత్యమున పరితృప్తిని చెందు చుండెను.

సత్సాంగత్యమున ఆమ్రపాలి జీవనము సాగుచున్నది. అసంగుని దీక్షాయుత దైనందినచర్య ఆమ్రపాలికి స్ఫూర్తి నిచ్చినది. మూడవ రోజున తానును అదే దినచర్యను అవలంబించుట మొదలిడినది. అసంగుడు బ్రాహ్మీముహూర్తముననే నిదురలేచుట, పద్మాసనాసీనుడై, ధ్యానము నందు నిమగ్నుడై యుండుట, మూడు గంటల కొకమారు కన్నులు తెఱచి, కొంత విరామము తరువాత మరల ధ్యానము చేసెడివాడు. సాయం సమయమున మాత్రము ఉద్యానవనమున మౌనముగ విహరించెడివాడు. దినమున కొకేసారి భోజనము. శయనము భూశయనమే. ఉదయము, సాయంత్రము ఒక గంట సమయము చొప్పున ఆమ్రపాలి పరిప్రశ్నమునకు సమాధానము యిచ్చుచుండెడివాడు.

ఆమ్రపాలి ప్రతినిత్యము రెండు గంటల పాటు తన వైభవో పేత గృహమున కలిగిన వస్తు సామగ్రిని గృహమందు సేవకులకు పంచియిచ్చెడిది. మిగిలిన సమయము తానును అసంగుని దినచర్యనే పాటించెడిది. రెండవ మాసమున తనవద్దగల మణి మాణిక్యములు పేదప్రజలకు పంచినది. మూడవ మాసమున

సర్వాభరణములు దాన మిచ్చినది. నాలుగవ మాసమున దస్తులను, యితర సామగ్రిని దాన మిచ్చినది. తాను ధరించుటకు మాత్రము మూడుజతల శ్వేతవస్త్రముల నుంచుకొనినది.

అసంగుని పరిచయమునకు పూర్వమే ఆమ్రపాలి విరక్తయై జీవించు చుండెడిది. ఆమెకును, ఆమె దేహమునకును దేహ సంబంధిత విషయములకును సంబంధము లేదు. కేవలము ఒక చక్కని అవకాశమునకు, జీవన ప్రయోజనమునకై తపనతో వేచి యున్నది. అసంగుని రాక ఆమె జీవనమునకు ఒక ప్రయోజనము గూర్చినది. అసంగుని యందు ఆమె కొక అతఃకరణ శుద్ధిగల అన్వేషకుడు గన్పించెను. అతని నిర్మల ప్రవర్తనము ఆమె కొక మార్గమును చూపినది. ఆమెది కూడ సహజ వైరాగ్యమే. అది ఏర్పడిన తీరు వినూత్నము. సంఘమందలి కృత్రిమ ప్రవర్తనలు, కపట విన్యాసములు, స్వార్థపూరిత జీవనములు, ఆమె విరక్తికి కారణములు.

ఆమె విరక్తికి, అసంగుని విరక్తికి భేదము ఆమె గ్రహించినది. అసంగుని విరక్తిలో ఏహ్య భావము లేదు. ద్వేష భావము లేదు. నిరాకరణము లేదు. అదియే ఆమెను ప్రత్యేకముగ ఆకర్షించినది. సంఘపరముగ చూసినచో తన గృహమున నివసించుటకు సామాన్యులే అంగీకరింపరు. సత్సాధకులు కూడ భయపడుదురు. అటువంటిది యిత డే జంకు, గొంకు లేక ప్రవర్తనమున ఏ వికారము లేక నిర్మలచిత్తుడై తన యింట నివసించెను. తా నడిగిన

ప్రశ్న లన్నింటికిని ఆదరముతో సమాధానము లందించెను. ఇతని సాంగత్యము నాకింకను యెంతయూ అవసరము అని భావించినది.

చాతుర్మాస్య దీక్ష ముగిసిన మర్నాడు అసంగుడు ఆమ్రపాలికి వీడ్కోలు పలికి బుద్ధుని చేరుటకు సంసిద్ధుడయ్యెను. ఆమ్రపాలి కూడ సంతోషముతో యిట్లనెను: "పోదము పదండి. నేనునూ బుద్ధుని చేరెదను. ఆశ్రమ ధర్మమును స్వీకరింతును. దైవ సాన్నిధ్యము తప్ప నాకు వలసిన దేమియు లేదు."

అసంగుడు మొదట ఆశ్చర్యపడినను అటుపైన ఆనందము పొందెను.

ఇరువురును ఆశ్రమము చేరిరి. అసంగుడి రాక భిక్షుకులలో మరల కలవరము రేపినది. ఓహో! సంసారముతో వచ్చినాడు. సన్యాస ధర్మము వదలి సంసారిగా జీవించుటకై గురుదేవుని అనుమతి కావలెను కాబోలు. ఈతనిపై ఆ ధర్మమూర్తి కెందులకింత కరుణయో. మొదటి నుండియు ప్రత్యేక దృష్టియే. గురువు అనుగ్రహ మెట్లుండునో మనకు తెలియదు కదా! అనుకొనుచు గుసగుసలు ప్రారంభించిరి. కొందరు నవ్విరి. కొంద రీసడించుకొనిరి. కొందరు సందేహించిరి. మరికొందరు మౌనము వహించిరి.

అసంగుడు అందరిని చిరునవ్వుతో కుశల మడుగుచు అవలోకి తేశ్వరుని కుటీరము చేరెను. ప్రవేశమునకై అనుమతి కోరెను. లోపలికి తన సహాధ్యాయితో యేగెను. బుద్ధుని పాదపద్మముల వద్ద మోకరిల్లి

నమస్కరించెను. ఆమెనూ అట్లే చేసినది. బుద్ధుడు యిద్దరిని ఆశీర్వదించి, అసంగుని కుశలమా అని ప్రశ్నించెను. అసంగుడు కుశలమే అని తల యూపెను. అటుపై యిట్లనెను : "ఆమ్రపాలి తమ సాన్నిధ్యమును కోరుచున్నది. ఆశ్రమ దీక్షను స్వీకరించుటకు సిద్ధముగా నున్నది. అటుపై తమ ఆజ్ఞ. బుద్ధుడు మందహాసము చేసి ఈమె మన సంఘమున మొదటి స్త్రీ మూర్తియై యుండగలదు. సిద్ధిని పొందగల దీక్ష ఈమె యందున్నది. ఆశ్రమమును, ఆశ్రమ వాసులను పరిచయము చేయుము. సర్వము శుభమగుగాక !"

ఆమ్రపాలి వినయముతో "స్వామీ! నేను ధన్యురాలను. తమ అనుగ్రహము లభించినది. నా వద్ద ఒక విశాలమగు ఉద్యాన వనము, అందులో ఒక విశేషమైన భవనము కలదు. అది మీ పాదములకు సమర్పితము. నా జీవితము మీకు సమర్పితము" అని మరల నమస్కరించినది.

అట్లే అగుగాక! అని బుద్ధుడు లేచి నిలబడి కుటీరము నుండి యీవలకు వచ్చి తన నిర్ణయమును సంఘమునకు తెలిపెను. సంఘము మౌనముతో తలలు వంచి నమస్కరించినది.

## 7

**మ**ర్నాడుదయము గౌతమ బుద్ధుడు ఆశ్రమవాసు లందరిని సమావేశపరచి ఇట్లు ప్రసంగించెను.

"సృష్టి యందు సంగమే బంధము. సృష్టి దైవము రూపమే. రూపమునకు గుణ విశేషములు కలవు. ప్రతి రూపమునకు నామము, గుణములు యుండును. వీనికి కేంద్రముగ దైవముండును. దైవము చుట్టును గుణములు, నామము, రూపము ఆవరణములుగ ఏర్పడును. దేహము నందలి దేహి నిజమునకు దైవ ప్రజ్ఞయే. అతడు గుణములకు లోబడి యుండుటచే దైవమే తానని మరచును. తాను వేరు, దైవము వేరు అని భావించును. ఇది గుణముల ప్రభావమే. ప్రకృతి త్రిగుణముల నాధారము చేసుకొని సృష్టి అల్లిక చేయును. అందేర్పడు రూపము లన్నిటియందును దైవము ఉపస్థితుడై యుండును. ప్రకృతి దైవము నుండి ఉద్భవించి త్రిగుణాత్మకముగ సృష్టిచేయుట, అందు దైవమే గుణముల నుండి దిగి వచ్చి కోటాను కోట్ల జీవుడుగ నేర్పడుట గమనింపవలెను.

దైవమును చేరుట కనేక మార్గములు తెలుపబడి యున్నవి. జీవలక్షణమును బట్టి ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గమున దైవమును చేరుటకు ప్రయత్నింతురు. ప్రకృతి నుండి పుట్టిన జీవునకు మాయా మోహములు తప్పవు. జీవులు చూచునది, వినునది, అనుభవించు నది; ఇంద్రియముల ద్వారములు, గుణములలోనికి దిగిన జీవుడు

ఇంద్రియములలోనికి కూడ దిగును. ఇట్లు దిగబడిన జీవుడు సత్యమును దర్శించలేడు. తన చుట్టును ఏర్పడిన ఆవరణలు చూచు విషయమున, విను విషయమున వికృతి చెందును. తాను చూచునది దైవము యొక్క రూపమే అని తెలిసినను గుర్తురాదు. తాను వినునది దైవము నుండి వచ్చు శబ్దమే అని గ్రహింపుకు రాదు. తాను రుచి చూచునది బ్రహ్మమే అయిననూ అట్లనిపించదు. తద్భిన్నమగు గుణ సముదాయములనే చూచు చుండును. చాల మంది తాము చూచునది సత్య మనుకొందురు కాని తన రంగు టద్దములతో తాను చూచుచున్నాడు కనుక వున్నది కనిపించక తన రంగుతో కలిసి అది వేరుగ కనిపించును. పచ్చకామెర్ల వానికి ప్రపంచమంతయు పచ్చగ కనిపించును కదా! ఎఱ్ఱని కళ్ళజోడు పెట్టుకొని ప్రపంచమును చూచినచో ఎఱ్ఱగ నుండును. నల్లటి అద్దములతో చూచినచో మబ్బు కమ్మినట్లుండును. ఏ రంగు లేక చూచినచో వున్నది వున్నట్లు గోచరించును.

నువ్వు చూచునది సత్యము కాదు. ఉన్నది సత్యము. ఉన్నది చూచుటకు సత్త్వ మొక్కటే ప్రధానము. రజోగుణ దోషము కలవారు, తమోగుణ దోషము కలవారు వున్నది చూడలేరు. వారు చూచు నదియే, విన్నదియే సత్యమని వాదింతురు. ఉన్నది చూచువాడు ఋషి. ఉన్నది దైవమే. దైవమును చూచుటకు గుణములలో సత్త్వ గుణమే ఆధారము. రజస్సు, తమస్సు లధికముగ నున్నవారు రాగము, ద్వేషము, కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము, సందేహము, భయము అను పొరలలో నుండి చూతురు గనుక వున్నది చూడలేరు. చూచినది, విన్నదే సత్య మనుకొందురు. సత్త్వగుణమును ఆశ్రయించినవాడు జ్ఞానము నందు ఆసక్తి కలిగి

యుండును. జ్ఞానమనగా చూచువాడు, చూడబడినది, చూచుట ఏకత్వము చెందుటయే. చూచువాడు, చూడబడుచున్నది తానే అని భావించుట ద్వారా ఇట్టి ఏకత్వము సిద్ధించగలదు. కనపడుచున్నది తనకన్న భిన్నమని భావించినవాడు మాయలో పడును. కావున సత్త్వ మభ్యసించు జ్ఞానికి తానే సర్వము నందును గోచరించును. తనకన్న భిన్నముగ నేదియు గోచరింపదు. అట్టివాని దివ్యప్రజ్ఞ పరిసరముల యందలి దివ్యత్వముతో ఏకత్వము చెందును. ప్రకృతి పొరలు (మాయా వర్ణములు) అడ్డగింపక సత్యదర్శన మగును. చీమ నుండి బ్రహ్మము వరకు సమస్తము నందు బ్రహ్మమే యున్నాడని భావించుట ఈ మార్గమున ముఖ్య కర్తవ్యము.

మనము చూచునప్పుడు గ్రహములు, గోళములు, తారకలు, పంచభూతములు, చరాచర జగత్తు, అనంతములైన రూపములతో జీవులు కన్పట్టుచుందురు. వాని పోకడలు కూడ అనంతములే. వానితో సంబంధ మేర్పరచుకొన్న వానికి అవియే యుండును. నామము, రూపము, స్వభావము, గుణములతో చుట్టరికములు చేయువారికి శత్రుత్వము, మిత్రత్వము ఏర్పడుచుండును. వ్యక్తులపై తమకు తోచిన మంచి చెడ్డలు మున్నగు అభిప్రాయములు ప్రోగై కలవరపడుచున్నవి. ప్రవృత్తి మార్గమున సమస్తము నందు దైవమును చూచుటయే నివృత్తి మార్గము. లేనిచో ప్రకృతి మాయను దాటలేము.

దైవాంశగ త్రిగుణముల నుండి మానవుడు దిగిరాగ మానవుని యందు అహంకారము, బుద్ధి, మనస్సు మూలశక్తులుగ నేర్పడును. వీని ఆధారముగ చేసుకొని ఇంద్రియములు, దేహము కర్మా చరణము చేయుచు ఫలితములుగ దిగుచున్నవి. ఫలితముల నుండి పుట్టిన సంకల్పములు మరల మనస్సును, బుద్ధిని, అహంకారమును

ప్రేరేపించుచుండగ మరల కర్మములు, ఫలితములు పుట్టుచుండును. ఫలితములు సంకల్పములను, సంకల్పములు ఫలితములను నొక వలయాకారముగ నేర్పడి జీవుని సృష్టి చక్రమున త్రిప్పును. మానవుడు మనో బుద్ధి అహంకారముల కన్న పైవాడు. తాను దైవము నుండి ప్రకృతి ద్వారా దిగి వచ్చినవాడే. అది తెలియుటకు తన యందలి దైవమును, పరిసరముల యందలి దైవమును స్మరించవలెను. అపుడు కర్మల ఫలితములపై, వ్యక్తుల మంచి చెడ్డలపై మనస్సు నిలవదు. ఈ స్మరణ దృఢము కాగ ఇతరములతో సంబంధము ఛేదింపబడి సమస్తము నందలి దివ్యత్వముతో సంఘ మేర్పడును. దీనినే అసంగ అస్త్రము అందురు.

అసంగుడు దీక్షతో అసంగ మార్గమును అవలంబించినాడు. అతడు సమస్తమునందు దైవముతోనే సంబంధ మేర్పరుచు కొనినాడు. దానినే సాధన చేసినాడు. వ్యక్తులపై గల అభిప్రాయము లను దాటి వ్యక్తిగ నిలబడిన దైవ ప్రజ్ఞను చూచుట నేర్చినాడు. మంచి చెడ్డలను చూడక దైవమునే చూచుట వలన అతనికి దైవముతోనే సంగము కుదురుట నారంభించినది. ఆ విధముగ అతని ప్రవృత్తి అంతయు 'అ' తోనే సంగముగ మారినది. 'అ' అనగా దైవము. దైవముతో సంగము అతనికి చేరువ కాసాగినది. మీ కందరికిని ఆమ్రపాలి యందు వేశ్య కానవచ్చినది. అసంగునికి ఆమె యందు గల అందము దైవముగ భాసించినది. అతడు దైవమునే ఆమ్రపాలి అందముగ దర్శించినాడు కాని మీరు దర్శించినట్లుగ దర్శించలేదు. అతనికి ఆమె యందలి సౌజన్యము మూర్తీభవించిన స్త్రీత్వము గోచరించినది. మీకవి గోచరింపలేదు.

మీరు ఆమ్రపాలిని గూర్చి విన్నది, ఆమె యందు చూచినారు. అసంగుడు వున్నది చూచినాడు. అందువలన అతని మనస్సున ఎట్టి వికారము ఉద్భవింపలేదు. మీరు అతని ప్రవర్తనమునకు కలవరపడి నన్ను కూడ కలవరపెట్ట చూచిరి. ఇది మీ యందలి భావములే కాని, అచట వున్నది కాదు. మీ ప్రవర్తన మీ గుణ సముదాయము యొక్క స్వభావమును మీ కద్దము పట్టి చూపినది. అందుచే మీకు తలవంపు తప్పలేదు.

ఆమ్రపాలి కూడ పరిణామము చెందిన జీవి. ఆమె అంత రంగమున దృఢచిత్త. చక్కని జిజ్ఞాసువు. బహిరంగమున జరుగు కార్యములను అంతరంగములోనికి ఆమె చొరబడనీయ లేదు. ఆమెకు మణిమణిక్యాదులు, కీర్తిప్రతిష్ఠలు తృణప్రాయములు. బహిః కరణముల ద్వారా దేహముతో నిర్వర్తించిన విషయములను నిర్లిప్తముగ నిర్వర్తించుచు అంతరంగమున ఆత్మశోధనతో పరిశుద్ధి చెందుచు పరిణతి నొందియున్నది. ఆమె ననుగ్రహించుటకే దైవము, అసంగుని ఆమెకు పరిచయము గావించినాడు. అసంగుని అనుగ్రహించుటకే దైవము నన్ను అసంగునికి పరిచయము కావించి నాడు. సర్వమును దైవ సంకల్పమే, దైవానుగ్రహమే. మన సంఘము నకు దైవము వైభవోపేతమైన వసతి నొకదానిని ఆమ్రపాలి ద్వారా అనుగ్రహించినాడు. మన మందరము ఇకపై ఆమ్రపాలి వనమున జీవించెదము. రండు, పోదము.''

బుద్ధ సంఘము, ఆమ్రపాలి వనము వైపునకు యానము సాగించిరి.

*శుభమ్!*